క్లుప్తంగా

'ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం' అధ్యక్షుడి ఎన్నిక


విష్ణుప్రసాద్

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు నీరటి విష్ణుప్రసాద్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని విష్ణు ప్రసాద్ తెలిపారు. ఇంటర్ బోర్డు బలోపేతానికి, విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా హాస్టళ్ల నిర్వహణ


ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ముస్తాబాద్: మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ మండల శాఖ అధ్యక్షుడు నవాజ్ కోరారు. ఈ మేరకు మండల వనరుల కేంద్రంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా ప్రైవేటు స్కూళ్లలో హాస్టళ్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు సీహెచ్.ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారమివ్వాలి

వేములవాడ అర్బన్: నాగాయపల్లి శివారులో ఆటో బోల్తాపడిన ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారమివ్వాలని ముంపు గ్రామాల నష్టపరిహార సాధన సమితి యువజన సంఘం అధ్యక్షుడు జింక అనిల్ ఒక ప్రకటనలో కోరారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

పుస్తెమెట్టెల వితరణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన తెడ్డు లక్ష్మి–నర్సయ్య దంపతుల కూతురు రోషిని వివాహానికి సామాజిక కార్యకర్త నేవూరి వెంకట్‌రెడ్డి బుధవారం పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గన్న మల్లారెడ్డి, గంట వెంకటేశ్‌గౌడ్, గడ్డం జితేందర్, మాజీద్, నిమ్మ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌కు చెందిన మానస అనే నిరుపేద యువతి వివాహానికి మన్నెగూడెంకు చెందిన కటకం ప్రసాద్ పుస్తెమెట్టెలు, పట్టుచీరను వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి చేతులమీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసాద్‌ను అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల తనిఖీ


వేబిల్లులు పరిశీలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం పోలీసులు తనిఖీ చేశారు. ట్రాక్టర్ల ధ్రువీకరణ, రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వేబిల్లులను పరిశీలించారు. వేబిల్లులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ట్రాక్టర్లు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై ముభీద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని రామన్నపల్లెకు చెందిన సిలివేరి నాంపల్లి ఇటీవల గుండెపోటుతో మరణించగా.. బాధిత కుటుంబాన్ని తంగళ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు కోడి అంతయ్య బుధవారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ ఆత్మకూరి రంగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరి సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రంగి: మాల్లారంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో లైన్ మరమ్మతు కారణంగా గురువారం రుద్రంగి మండల కేంద్రంతోపాటు కొత్తపేటలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ సెస్ ఏఈ రాకేశ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రేపు తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

తంగళ్లపల్లి: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లచ్చాలు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

కాలనీల్లో సమస్యలెన్నో..


ఈ చిత్రంలో కనిపిస్తున్నది అయ్యోరుపల్లిలోని హనుమాన్ టెంపుల్ పక్కన ఉన్న మురికిగుంత. ఊరిలోని మురుగునీరు వచ్చి ఆ గుంతలోనే కలుస్తున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు మురుగువాసనతో ఇబ్బందులు పడుతున్నారు.


ఈ మట్టిరోడ్డు వేములవాడ మున్సిపాలిటీలోని విలీన గ్రామం తిప్పాపూర్‌లోని హనుమాన్ టెంపుల్ పక్కన ఉన్న కాలనీది. ఈ కాలనీలో డ్రెయినేజీ నిర్మించినప్పటికీ సీసీ రోడ్డు వేయలేదు. వాహనాలు, పాదచారులు నడుస్తుంటే దుమ్ము ఇళ్లలోకి చేరి, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తమ బాధ ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు.

- ఏళ్లుగా పరిష్కారం కాని వైనం
- మౌలిక వసతులు కరువు
- గ్రామపంచాయతీలే ముద్దు అంటున్న స్థానికులు
- వేములవాడ విలీన గ్రామాల్లో తీర్మానాలు

సాక్షి ఫోకస్


ఈ ఫొటో నాంపల్లిలోని సిరిసిల్ల–కరీంనగర్ రోడ్డు. ఈ రహదారిని ఆనుకుని ఉన్న ఇళ్లు, హోటళ్లు మురుగునీరు రోడ్డుపై వదులుతున్నారు. డ్రెయినేజీలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ మార్గంలో మురికినీరుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపాలిటీలో విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఏళ్లుగా మౌలిక వసతులు లేక ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ విలీనం చేసి పన్నులు పెంచారే తప్ప కనీస వసతులు కల్పించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీలుగా ఉన్నప్పుడే బాగుండేనని.. మున్సిపాలిటీలో విలీనం చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటున్నారు.

అయ్యోరుపల్లిలో మొదలైన నిరసన

వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం అయ్యోరుపల్లి గ్రామస్తులు ఇటీవల నిరసన తెలిపారు. తమ కాలనీని మళ్లీ గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. గత శుక్రవారం రాత్రి సమావేశమైన గ్రామస్తులు మున్సిపాలిటీ వద్దు.. గ్రామపంచాయతీ ముద్దు అని తీర్మానం చేయడంతోపాటు రాత్రి వేళ నిరసన తెలిపారు.

విలీన సమయం నుంచి..

వేములవాడ మున్సిపాలిటీలో నాంపల్లి, శాత్రాజుపల్లి, కోనాయపల్లి, తిప్పాపూర్, అయ్యోరుపల్లి గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. విలీనం అనంతరం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. కౌన్సిలర్లు గెలిచి నాలుగేళ్లు గడుస్తున్నా విలీన గ్రామాల్లో కనీస అభివృద్ధి జరగలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల గురించి ఎవరికీ చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయ్యోరుపల్లిలో సమస్యలు..

- వేములవాడ నుంచి అయ్యోరుపల్లికి రోడ్డు సరిగ్గా లేదు.
- డ్రెయినేజీలు సరిగ్గా లేక కాలనీలు కంపు కొడుతున్నాయి.
- పోచమ్మగుడి వద్ద మురికినీరు ఆగి దుర్వాసన వెదజల్లుతుంది.
- శ్మశానవాటిక, బతుకమ్మ తెప్ప లేదు.

తిప్పాపూర్‌లో ఇవీ..

- డ్రెయినేజీలు, సీసీరోడ్లు లేవు.
- తిప్పాపూర్‌లో రెండు బోరుమోటార్లు కాలిపోయాయి.
- శ్మశానవాటిక లేక మూలవాగులోనే దహన సంస్కారాలు చేస్తున్నారు.
- మూలవాగుపై వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- ప్రభుత్వ పాఠశాల వద్ద డ్రెయినేజీ లేదు.
- మిషన్‌భగీరథ పైపులైన్ల లీకేజీలను మరమ్మతు చేయించాలి.

నాంపల్లిలో సమస్యలు..

- డ్రెయినేజీలు లేక, పరిసరాలు కంపుకొడుతున్నాయి.
- బోరుమోటార్లు కాలిపోయాయి.
- శ్మశాన వాటిక లేదు.
- చెత్తబండి వారానికోసారి వస్తుంది.
- డ్రెయినేజీలను రెండు నెలలకోసారి శుభ్రం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలి



వేములవాడ మున్సిపల్ విలీనంతో అయ్యోరుపల్లిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కనీసం సమస్యలైన పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుంటలేరు. ఎప్పటిలాగే గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి.

– తిరుపతి, అయ్యోరుపల్లి

డ్రెయినేజీలు కంపు కొడుతున్నాయి



తిప్పాపూర్‌లో డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి. గతంలో వేసిన సీసీరోడ్డు గుంతలుపడి.. నడిచేందుకు వీలు లేకుండా తయారైంది. అధికారులు పట్టించుకుని డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి.

– పులి వెంకటేశ్, తిప్పాపూర్

మంచినీటికి ఇబ్బంది ఉందన్నా పట్టించుకుంటలేరు



నాంపల్లి–గొల్లపల్లెలో మంచినీటి బోరు మోటార్ కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా పట్టించుకునేవారు లేరు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెప్పిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మంచినీటికి ఇబ్బందిగా ఉందని చెప్పినా ఎవరూ పట్టించుకుంటలేరు.

– చిర్రం శ్రీనివాస్, గొల్లపల్లి

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లిలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం టీబీ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.500, పీఎం టీబీ ముక్త్ అభియాన్ రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తోందని వైద్యాధికారి చిరంజీవి తెలిపారు. పలువురికి వైద్య పరీక్షలను చేశారు. సూపర్‌వైజర్ నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: స్థానిక జీపీ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ తర్రె ప్రభలత, ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి రాందాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అక్కపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

అధికారులపై చర్య తీసుకోవాలి

వీర్నపల్లి: మండల కేంద్రంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభమైన అరగంటలోనే ముగియడంతో బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు నిరసన తెలిపారు. ఆరోగ్య సిబ్బంది తప్ప ఇతర అధికారులు రాలేదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.


రుద్రంగి: పథకాలను స్క్రీన్‌పై చూస్తున్న ప్రజలు

బాల్యమిత్రుల కుటుంబాలకు అండ



బండపల్లిలో ఆర్థికసాయం అందిస్తున్న బాల్య మిత్రులు, రుద్రవరంలో..

చందుర్తి: బండపల్లికి చెందిన కొండ బాలకృష్ణగౌడ్ వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబానికి అతని బాల్యమిత్రులు అండగా నిలిచారు. బుధవారం రూ.35 వేల ఆర్థికసాయం అందించారు. మున్ముందు కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. ఇందూరి మధు, లింగంపల్లి లక్ష్మీరాజం, దుర్సేటి ప్రేమ్‌చారి, గజవాడ శ్రీనివాస్, దుమ్ము అంజయ్య, నలుమాచు రవీందర్‌రెడ్డి, నేతికుంట సత్తయ్య, దారం కిషన్‌రెడ్డి, మెంగని బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన పార్వతి శ్రీనివాస్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయమవగా కాలు తీసివేశారు. విషయం తెలుసుకున్న అతని సోదరుడు రాజేశ్ పదోతరగతి మిత్రులు బుధవారం రూ.24 వేల ఆర్థికసాయం అందించారు.

హైమాస్ట్ లైట్లు బాగు చేయరూ!


ఇందిరమ్మకాలనీలో పని చేయని లైట్లు

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని నెలలుగా వెలగడం లేదని.. రాత్రిళ్లు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని బాగు చేయాలని కోరుతున్నారు.

నేడు రాములోరి అక్షింతల ఊరేగింపు

ఎల్లారెడ్డిపేట: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాములోరి అక్షింతలకు భక్తుల సమక్షంలో గురువారం ఉదయం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తామని శ్రీరామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు చందుపట్ల లక్ష్మారెడ్డి తెలిపారు. స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి భక్తి సంఘం వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. స్వామి వారి కలశాన్ని మోయాలనుకునే వారు తప్పకుండా సంప్రదాయ దుస్తుల్లో (తెల్ల లుంగీ, షర్టు) ధరించి, రావాలన్నారు. 500 ఏళ్ల తర్వాత మనకు ఈ అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కోనరావుపేట: మామిడిపల్లిలో బుధవారం మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాసాల రాజారాం, ప్రధాన కార్యదర్శిగా సాసాల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సాసాల గంగయ్య, కోశాధికారిగా సాసాల చిన్న మల్లేశం, కార్యదర్శిగా సాసాల రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా ముదాం నారాయణ, సాసాల చిన్న శ్రీనివాస్, దేశెట్టి ఆదిరెడ్డి, సాసాల రాములు, దేశెట్టి మల్లేశం ఎన్నికయ్యారు.

పొదుపు పథకాలను తెలుసుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోనరావుపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పొదుపు పథకాల గురించి తెలుసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఉపేందర్ అన్నారు. నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు మేజిక్, పాటల ద్వారా ఆర్థికాంశాలను వివరించారు. విద్యార్థులకు అవసరమైన స్మార్ట్ స్కాలర్ అనే ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు, రబ్బర్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శేఖర్, బ్రహ్మం, భూమేశ్, కవిత, దివ్య తదితరులున్నారు.

బదిలీ హెచ్‌ఎంలు, టీచర్లకు సత్కారం



విలాసాగర్, సిరిసిల్లలో బదిలీ హెచ్‌ఎంలు, టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోయినపల్లి: విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేయడంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని విలాసాగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో పని చేసి, బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం మిట్టపల్లి పర్శరాం, టీచర్ రోండ్ల జగన్‌మోహన్‌రెడ్డిలకు స్కూల్లో బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల ఎడ్యుకేషన్: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ హైస్కూల్ హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖుద్దూస్ బదిలీ అయ్యారు. వారిని బుధవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ ఆడెపు నరేశ్, కౌన్సిలర్ రెడ్డి నాయక్, ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఆటోమేషన్ ఓరియంటేషన్

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్రస్థాయి గ్రంథాలయ ఆటోమేషన్ ఓరియంటేషన్ నిర్వహించారు. రాష్ట్రంలోని 22 గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్లు హాజరయ్యారు. లైబ్రరీస్ ఆటోమేషన్ ప్రాముఖ్యతను జగిత్యాల డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ కృష్ణారెడ్డి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ రెహానా ఇఫ్పత్, లైబ్రేరియన్ రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టల్ పథకాలు వినియోగించుకోండి

బోయినపల్లి: పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలని కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ శివాజీ అన్నారు. బుధవారం బోయినపల్లి సబ్ పోస్టాఫీసులో వార్షిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి, స్థానిక పోస్టల్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంతో మహిళలకు, ఆర్‌పీఎల్‌ఐ బీమా పథకం ప్రజలకు మేలు చేస్తుందని, సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లల వివాహాలకు అండగా నిలుస్తుందన్నారు. సేవింగ్స్, ఐపీపీబీ, పీఎల్ఐ తదితర పథకాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎస్పీఎం రాజమల్లు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న కరస్పాండెంట్ సంతోష్‌గౌడ్

సిరిసిల్లటౌన్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సిరిసిల్ల పత్తిపాక వీధిలోని సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల మొదటి వారంలో కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. అండర్–17 బాలికల విభాగంలో స్నేహ, బాలుర విభాగంలో వర్షిత్ సత్తా చాటారని కరస్పాండెంట్ సంతోష్ గౌడ్ తెలిపారు. వీరు బుధవారం నుంచి హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు బిజ్జాదేవన్య, మార్టిన్ లూథర్, సుధాకర్, పీఈటీ మదన్‌లతో కలిసి విద్యార్థులను అభినందించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వేములవాడఅర్బన్: చింతల్‌ఠాణాకు చెందిన జాతరగొండ మల్లవ్వ, కుర్ర బాలవ్వ మంగళవారం ఆటో బోల్తాపడిన ఘటనలో మృతిచెందిన విషయం విదితమే. వారి మృతదేహాలకు బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వేములవాడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్నవారిని కరీంనగర్‌లోని చల్మెడ ఆస్పత్రికి పంపించారు. ఆయన వెంట సర్పంచ్ రాణి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు తదితరులున్నారు.


మల్లవ్వ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న లక్ష్మీనరసింహారావు

చందుర్తి: మండలంలోని దేవునితండా సర్పంచ్ పంతుల్‌నాయక్ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం పరామర్శించారు. కేడీసీసీబీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, నాయకులు మారుపాక రాజు, గబ్బర్‌సింగ్ తదితరులున్నారు.

కామారెడ్డికి బస్సు నడిపించాలి

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల ఆర్టీసీ డిపో నుంచి కోనరావుపేట మీదుగా శివంగాలపల్లి, అక్కపల్లి, ఎల్లారెడ్డిపేట నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి పల్లె వెలుగు బస్సు నడిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ సోమాజిగూడలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మంత్రిని కలిశారు. ఆయనను సన్మానించి, వినతిపత్రం అందించారు. ఎల్లారెడ్డిపేట బస్టాండ్‌లో ఆర్టీసీ తరఫున షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. వీటికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిలింగు, సంతోష్‌గౌడ్, శ్రీనావాస్ తదితరులున్నారు.


మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

జెడ్పీటీసీ సభ్యురాలికి సన్మానం

తంగళ్లపల్లి: స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు పూర్మాని మంజుల రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు హారికారెడ్డి, ఉపాధ్యక్షురాలు సంగీత, భాగ్యలక్ష్మి, సునీతారాణి తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

'పారిశుధ్య పనుల్లో అశ్రద్ధ వద్దు'

ముస్తాబాద్: పారిశుధ్య పనుల్లో మల్టీపర్పస్ వర్కర్లు అశ్రద్ధ వహించొద్దని ఎంపీడీవో రమాదేవి అన్నారు. బుధవారం వెంకట్రావుపల్లెలో పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చూపిన పనులు చేయాలని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆరోగ్యం పంచాయతీ సిబ్బంది చేతిలోనే ఉంటుందన్నారు. సమస్యలుంటే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.